క్లుప్తంగా

'పంచాంగ ఆవిష్కరణ' విజయవంతం చేయండి

ఆసిఫాబాద్‌అర్బన్: హైదరాబాద్‌లోని తెలంగాణ సార్వత్రిక పరిషత్‌లో డీడీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వాసుదేవశర్మ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించే రాబోవు క్రోధినామ సంవత్సర పంచాంగ ఆవిష్కరణ కార్యక్రమాన్ని జిల్లాలోని డీడీఎస్ అర్చకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శిరీష్‌శర్మ, శ్రీనివాస్‌శర్మలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు హర్కర్ వేణుగోపాల్ రావు, కమిషనర్ హనుమంత్‌రావ్, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, రాష్ట్ర నాయకులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని డీడీఎస్ అర్చకులు పూర్తిస్థాయిలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం


పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ

కెరమెరి: మండలంలోని సుల్తాన్‌గూడలో ప్రారంభమైన శ్రీ వేంకటేశ్వర స్వామి జాతరలో బుధవారం కబడ్డీ పోటీలను ఎంపీపీ పెందోర్ మోతీరాం ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎల్లప్ప, దేవ్‌రావు, శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆనంద్‌రావు, నాయకులు ఎల్లన్న, ధర్మూ, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో కొనసాగుతున్న కుష్ఠు వ్యాధి సర్వే


సర్వే నిర్వహిస్తున్న హెచ్‌ఈవో రవిదాస్

వాంకిడి: మండలంలోని పాతగూడ, లింబారావుగూడ, లక్ష్మీపూర్, కోపగూడ, వెల్గి గ్రామాల్లో ఆరోగ్య వైద్యశాఖ అధికారులు బుధవారం కుష్ఠు వ్యాధి సర్వే నిర్వహించారు. వ్యాధిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కుష్ఠు వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం వెల్గి పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య సంబంధిత అంశాలపై అవగాహన కల్పించారు. హెచ్‌ఈవో రవిదాస్, ప్రధానోపాధ్యాయుడు కనకమారు, ఏఎన్‌ఎం, ఆశ వర్కర్ పాల్గొన్నారు.

పల్లెల్లో జాజిరి సందడి


దహెగాంలో జాజిరి ఆడుతున్న మహిళలు

దహెగాం: హోళీ పండుగకు పది రోజుల ముందు నుంచే పల్లెల్లో జాజిరి సందడి నెలకొంది. చిన్నారులు జాజిరి ఆడుతూ ఇంటింటికీ తిరుగుతున్నారు. చిన్నారులతో పాటు మహిళలు సైతం దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి జాజిరి అంటూ సంప్రదాయ పాటలు పాడుతున్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు, ఇండ్లు మంజూరు చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు గణపురం మహేశ్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌లు డిమాండ్ చేశారు. బుధవారం సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేని మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. మోహన్‌గౌడ్, లక్ష్మణ్, సంతోష్, సదాశివ్, జలీల్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం


మాట్లాడుతున్న నాయకులు

కౌటాల: బీజేపీతో అన్ని ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని బీజేపీ మండలాధ్యక్షుడు నారులేవాను పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆరె సంఘం భవనంలో బీజేపీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీతోనే అన్ని వర్గాల వారికి సమన్యాయం జరుగుతుందన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి మృత్యుంజయ్ కవిరాజ్, కమిటీ సభ్యులు కుంచాల సత్తయ్య, ఆదే చందు, బాజీరావు, తిరుపతి, శంకర్, భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవాగులో ఇసుక దందా

- నిత్యం ట్రాక్టర్లలో తరలింపు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- పట్టించుకోని అధికార యంత్రాంగం


పెద్దవాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ (ఫైల్)

పెంచికల్‌పేట్: మండలంలోని పెద్దవాగు నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. అధికారుల కళ్లు గప్పి కొంతమంది అక్రమార్కులు ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. ప్రతిరోజు పదుల సంఖ్యలో ట్రాక్టర్‌లతో ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని పెద్దవాగులో పెద్ద ఎత్తున ఇసుక నిల్వలు ఉండగా ఎల్లూర్, పెంచికల్‌పేట్, ఎల్కపల్లి, సంజీవనగర్ గ్రామాలకు చెందిన ట్రాక్టర్ యజమానులు ఇసుక రవాణా సాగిస్తున్నారు. గతంలో మండలంలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు డీడీ విధానం తీసుకొచ్చారు. రెండేళ్ల క్రితం ఒక్కో ట్రాక్టర్‌కు ఇసుక తరలించేందుకు రూ.1850 డీడీ చెల్లించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేయగా ట్రాక్టర్ యజమానులు డీడీ చెల్లించి ఇసుక రవాణా చేశారు. కానీ ఏడాది కాలంగా అధికారులు పెద్దవాగులో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాపై ఎలాంటి దృష్టి పెట్టకపోవడంతో ఇదే అదునుగా అక్రమార్కులు వందల సంఖ్యలో ట్రాక్టర్ ట్రిప్పులను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

పెద్దఎత్తున తరలింపు..

గ్రామాల్లో సాగుతున్న సీసీరోడ్లకు ఇసుక తరలిస్తున్నామని చెబుతూ పెద్దఎత్తున వ్యాపారులు ఇసుక మాఫియాకు తెరలేపారు. మండల కేంద్రంలో ఉన్న ఫ్లైయాష్ ఇటుకల బట్టీల వద్ద ఇసుక డంపులు ఏర్పాటు చేసి రాత్రి వేళల్లో ఇతర ప్రాంతాలకు లారీల్లో తరలిస్తున్నారు. ప్రతీరోజు సుమారు 150 ట్రిప్పుల ఇసుక ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ప్రజలు వాపోతున్నారు.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ..

పెద్దవాగులో జరుగుతున్న అక్రమ రవాణాను అరికట్టాల్సిన అధికారులు అటువైపు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. గ్రామ కార్యదర్శి, రెవెన్యూ అధికారులు, ఎంపీడీవో, ఎంపీవో, డీపీవో, పోలీసు సిబ్బంది ఇసుక రవాణా జరిగితే అడ్డుకునే అవకాశం ఉన్నా పగలు జరుగుతున్న అక్రమ రవాణాను అడ్డుకోవడంలో విఫలమవుతున్నారు. ఇసుక మాఫియా నుంచి మామూళ్లు తీసుకుంటూ ఇసుక వ్యాపారులకు కొమ్ముకాస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెద్దవాగులో సొంతంగా ఇసుకను తరలించడానికి ర్యాంపులు ఏర్పాటు చేసి వ్యాపారులు ఇసుక తరలిస్తున్నా క్షేత్రస్థాయిలో అధికారులు అడ్డుకోకపోవడం విడ్డూరంగా ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు. నిత్యం వందల సంఖ్యలో ఇసుక తరలిస్తున్న అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటం విమర్శలకు దారితీస్తుంది. ఇప్పటికైనా మండలంలో జరుగుతున్న ఇసుక రవాణాపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తాం. గత రెండు రోజుల క్రితం పెద్దవాగు నుంచి ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో సిబ్బందితో కలిసి ట్రాక్టర్లను పట్టుకున్నాం. గ్రామాల్లో సీసీ రోడ్లకు ఇసుక తరలిస్తున్నారని నిర్ధారణ కావడంతో వదిలేశాం. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. - వెంకటేశ్వర్‌రావు, తహసీల్దార్

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి


నూతన కమిటీ పత్రాలు అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రెబ్బెన: ఏఐటీయూసీ ఫిట్ కమిటీ, మైన్స్ కమిటీ, సేఫ్టీ కమిటీ సభ్యులు నిత్యం కార్మికులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి అన్నారు. నూతనంగా ఎన్నికైన గోలేటి సీహెచ్‌పీ ఫిట్ కమిటీ, మైన్స్ కమిటీ, సేఫ్టీ కమిటీ సభ్యులను బుధవారం సీహెచ్‌పీ డీజీఎం భీంరావ్ జాడేకు పరిచయం చేశారు. ఆయన మాట్లాడుతూ కార్మికులు ఎంతో నమ్మకంగా ఏఐటీయూసీకి గుర్తింపు హోదా కల్పించారన్నారు. యాజమాన్యానికి, కార్మికులకు మధ్య వారధిగా ఉండాలని పేర్కొన్నారు. బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి, సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి


పనులు పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సంతోష్

రెబ్బెన: నేషనల్ హైవే పనుల్లో భాగంగా మండల కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ కోరారు. మండల కేంద్రంలో నత్తనడకన సాగుతున్న పనులతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను నేషనల్ హైవే రెసిడెంట్ ఇంజనీర్ అంజద్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయనతో కలిసి పెండింగ్ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ హైవే పనుల్లో భాగంగా మండల కేంద్రంలో పూర్తిస్థాయిలో డ్రైన్ నిర్మాణ పనులు చేపట్టకపోవటంతో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి ఇళ్లలోకి వర్షపు నీరు చేరిందన్నారు. కాలనీలకు వెళ్లే అప్రోచ్ రోడ్డు పనులు సైతం అసంపూర్తిగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పలు సమస్యలను రెసిడెంట్ ఇంజనీరు దృష్టికి తీసుకెళ్లగా గురువారం నుంచి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎంపీటీసీ మధునయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో

కెరమెరి: గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపీడీవో కృష్ణారావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ పథకం సిబ్బందికి, గ్రామ కార్యదర్శులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎండలు మండుతున్న దృష్ట్యా భూగర్భజలాలు అడుగంటుతున్న గ్రామాలను గుర్తించాలన్నారు. మారుమూల గ్రామాల్లో మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని సూచించారు. అంతకు ముందు ధనోరా, సావర్‌ఖేడా పంచాయతీల్లో క్షేత్రస్థాయిలో ఉపాధి పనులు పరిశీలించారు. ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఈసీ ఐక్యానాయక్ తదితరులు ఉన్నారు.

విగ్రహాల ప్రతిష్టాపన


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీశ్ బాబు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఆర్‌ఆర్‌వో కాలనీలో బుధవారం నూతనంగా నిర్మించిన దేవాలయంలో ఎల్లమ్మ, రేణుకామాత, నల్ల పోచమ్మ విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌడ కుల సంఘం నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మూడు సెల్‌ఫోన్‌ల అప్పగింత

కాగజ్‌నగర్‌రూరల్: ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న మూడు సెల్‌ఫోన్‌లను బాధితులకు ఈజ్‌గాం ఎస్సై రామన్‌కుమార్ అప్పగించారు. నజ్రూల్‌నగర్ విలేజ్ నంబర్.13కు చెందిన ప్రతాప్ సర్కార్, పెంచికల్‌పేటకు చెందిన కిరణ్, కాగజ్‌నగర్‌కు చెందిన సిద్దార్థలు సెల్‌ఫోన్లు పోగొట్టుకుని ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి బాధితులకు అప్పగించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఏఎస్సై హిరామన్, కానిస్టేబుల్ నయీం తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ రేషన్ కిట్ల పంపిణీ

కాగజ్‌నగర్‌రూరల్: దారుల్ అన్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో ట్రస్టు సభ్యులు రంజాన్ రేషన్ కిట్లను పంపిణీ చేశారు. ప్రధాన కార్యదర్శి ముఖఖం అహ్మద్ మాట్లాడుతూ 170 మందికి రూ.500 నగదుతో పాటు బియ్యం రేషన్ కిట్లను అందజేసినట్లు తెలిపారు. వృద్ధ మహిళలకు, వితంతువులకు రేషన్ కిట్లతో పాటు రూ. 200 అందజేశామన్నారు. రూ. 36వేల విలువైన లక్ష రేషన్ కిట్లు, రూ. లక్ష నగదు పంపిణీ చేసినట్లు తెలిపారు. ట్రస్ట్ జాయింట్ సెక్రటరీ హఫీజ్ రియాజ్, ట్రస్ట్ కోశాధికారి అబ్దుల్‌రహీం, వైస్‌ప్రెసిడెంట్ అబ్దుల్‌షాకీర్, సభ్యులు ఉన్నారు.

పునఃప్రారంభమైన అన్నదానం

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన సత్రం బుధవారం పునఃప్రారంభించారు. అన్నదాన సత్రంలో కోనప్ప దంపతులు, కోనేరు కృష్ణారావు దంపతులు గణపతి హోం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిత్యాన్నదానం చేశారు.

తీసుకున్న రుణాలు చెల్లించాలి


మాట్లాడుతున్న జగదీశ్వర్

కెరమెరి: బ్యాంకులు, స్త్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలను వెంటనే చెల్లించాలని ఏపీఎం జగదీశ్వర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో వీవో సభ్యులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్‌పీఏ లేకుండా చూడాలని పేర్కొన్నారు. మొండి బాకాయిలు ఉన్న వారు చెల్లిస్తే వడ్డీలేని రుణాలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. రికార్డులు నమోదు చేయాలని, పొదుపు పెంచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీఎం భీంరావు, మండల సమాఖ్య, ఐకేపీ సీసీలు ఉన్నారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కెరమెరి: మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎస్‌ఈ వాసుదేవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పంపిణీ


ఎద్దుకు టీకా వేస్తున్న పశు వైద్యాధికారి సాగర్

రెబ్బెన: గోలేటి గ్రామ పంచాయతీ పరిధిలో గల దుర్గాపూర్, అమీన్‌గూడ, గొండుగూడ గ్రామాల్లో బుధవారం పశువైద్య శిబిరాలను నిర్వహించారు. ఆయా గ్రామాల పరిధిలోని 214 ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. పశువైద్యాధికారి సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన


పోషకాహారం తినిపిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

రెబ్బెన: మండలంలోని కొండపల్లిలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షంలో భాగంగా పోషకాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులు తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు.
కాగజ్‌నగర్‌రూరల్: కోసిని గ్రామపంచాయతీ పర్దాన్‌గూడ, వంజీరి గ్రామపంచాయతీలోని నందిగూడ అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. సీడీపీవో సురేఖ, వంజీరి ప్రత్యేక అధికారి గోపిచంద్, సబ్ యూనిట్ అధికారి హస్సీనుద్దీన్, పాల్గొన్నారు.
కౌటాల: పిల్లలు, బాలింతలు, గర్భిణులు పోష్టికాహారం తీసుకోవాలని సీడీపీవో విజయలక్ష్మి అన్నారు. పోషణ పక్షంలో బుధవారం మండలంలోని కౌఠి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అక్షరభ్యాసం చేశారు. సూపర్‌వైజర్ షాకీరాబేగం తదితరులు ఉన్నారు.

టేకు వనం.. బహుసుందరం

- మోడి ఆశ్రమంలో 310 టేకు వృక్షాలు


టేకు చెట్ల వనం

కెరమెరి: మండలంలోని మోడి బాలికల గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో టేకు వనాలు పెంచుతూ అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు. విశాలమైన ప్రాంగణం.. చక్కని విద్యతో పాటు అన్ని సౌకర్యాలు కలిగిన మోడి గిరిజన బాలికల అశ్రమ ఉన్నత పాఠశాలతో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉంది. అందులో 520 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. హరితహారంలో భాగంగా వివిధ రకాల మొక్కలు నాటి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆదర్శంగా నిలుస్తున్నారు.

బాధ్యతగా..

2013 -14వ సంవత్సరం హరితహారంలో భాగంగా మోడి ఆశ్రమ పాఠశాలలో ఉపాధిహామీ పథకం అధికారుల సహకారంతో 500 టేకు మొక్కలు నాటారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది నాటిన మొక్కలను ఎప్పటికప్పుడు సంరక్షించారు. దీంతో నాటిన 500 మొక్కల్లో ప్రస్తుతం 310 టేకు మొక్కలు సజీవంగా ఉన్నాయి. విద్యార్థుల పట్టుదల, ఉపాధ్యాయుల కృషి ఫలితంగా నేడు పాఠశాల ప్రాంగణంలో టేకు వనం అవతరించింది. మరో 15 ఏళ్ల తర్వాత ఒక్కో చెట్టు ఖరీదు రూ. 3 వేలకు పైగా ఉండే అవకాశం ఉందని అటవీ అధికారులు పేర్కొంటున్నారు. దీంతో చెట్లు పూర్తిగా పెరిగాక విక్రయిస్తే రూ.లక్షల్లో లాభాలు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.

చెక్‌పోస్టు వద్ద అప్రమత్తంగా ఉండాలి



చెక్‌పోస్టు తనిఖీ చేస్తున్న సీఐ రాంబాబు

దహెగాం: ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కాగజ్‌నగర్ రూరల్ సీఐ రాంబాబు అన్నారు. బుధవారం మండలంలోని కల్వాడ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీ చేశారు. చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. వచ్చి పోయే ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఆయన వెంట ఎస్సై రాజు, సిబ్బంది ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి

పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని ఎస్సై రాజు అన్నారు. బుధవారం మండలంలోని పీపీరావుకాలనీలో గ్రామస్తులకు ఎన్నికలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు ఐక్యంగా ఉండి గ్రామాభివృద్ధికి పాటు పడాలన్నారు. అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామ యువత చెడు వ్యసనాలు వీడాలని పేర్కొన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి అందరు సహకరించాలన్నారు.

బీసీ నిరుద్యోగులకు రుణాలు మంజూరు చేయాలి


మాట్లాడుతున్న రూప్‌నార్ రమేశ్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని అర్హులైన బీసీ నిరుద్యోగ యువతీ యువకులకు ప్రభుత్వం వెంటనే సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నార్ రమేశ్ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ 2018లో దాదాపు 4వేల మంది నిరుద్యోగులు బీసీ సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోగా, కేవలం 529 మందికి మాత్రమే రుణాలు అందాయన్నారు. సంఘం నాయకులు ఆవిడపు ప్రణయ్, వైరాగడే మారుతి, బాల్దారపు మధుకర్, గడ్డల శంకర్, జక్కయ్య పాల్గొన్నారు.

ఏరియా సివిల్ ఎస్‌ఈకి సన్మానం


బాషాను సన్మానిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా సివిల్ డిపార్టుమెంట్ నూతన ఎస్‌ఈగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన షేక్ మదీనా బాషాను బుధవారం గోలేటిలోని జీఎం కార్యాలయంలో ఏఐటీయూసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్య మొగిళిలు ఏరియాలో కార్మికులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సివిల్ పనులపై ఎస్‌ఈతో చర్చించారు. కార్మికులు నివాసం ఉండే క్వార్టర్ల మరమ్మతు పనులు సకాలంలో పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి జగ్గయ్య, ఆనంద్, ఫిట్ కార్యదర్శి రమేశ్, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి గణేశ్, నాయకులు యుగేందర్, రవి, సురేశ్ కోరి, అంజయ్య, రవి, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా మైదానానికి స్థలం కేటాయించాలి


వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కౌటాల: శీర్షా గ్రామంలో క్రీడా మైదానం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని గ్రామస్తులు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పుష్పలతకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో క్రీడా మైదానం లేక యువకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామ సమీపంలోని ప్రభుత్వ ఖాళీ స్థలాన్ని పలువురు ఆక్రమించారని, స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని అంగన్‌వాడీ భవనం నిర్మాణానికి, క్రీడా మైదానానికి కేటాయించాలని కోరారు. బీజేపీ మండలాధ్యక్షుడు వానుపటేల్, ప్రధాన కార్యదర్శి మృత్యుంజయ్, కవిరాజ్, గ్రామస్తులు శంకర్, బీరయ్య, జగ్గయ్య, తిరుపతి, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..


రోడ్డు పనులు చేస్తున్న సిబ్బంది

తిర్యాణి: మండలంలోని త్రీ ఇన్ క్లైయిన్ నుంచి చిన్న అరటిపెల్లి స్టేజి వరకు రోడ్డు మరమ్మతులు జరుగుతుండగా అనుమతులు లేవని అటవీ అధికారులు నిలిపివేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో రోడ్డు మరమ్మతులు నిలిపివేత శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో అటవీ అధికారులు స్పందించి రోడ్డు పనులకు అనుమతులు ఇచ్చారు. దీంతో బుధవారం పనులు ప్రారంభమయ్యాయి.

సినిమా నిలిపివేయాలి

ఆసిఫాబాద్: ఇటీవల విడుదలైన 'రజాకార్' చలన చిత్రాన్ని నిలిపివేయాలని కోరుతూ ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం సమర్పించారు. సంఘం ప్రతినిధులు ఉబేద్‌బిన్ యాహియా, మహ్మద్ ఖలీల్, మహ్మద్ ముబష్సీర్, నిసార్ ఉన్నారు.